సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



నేడు అప్పన్న తెప్పోత్సవం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం (నౌకావిహారం) శుక్రవారం సాయంత్రం వరాహ పుష్కరిణిలో జరగనుంది.



అలలపై సయ్యాట

పర్యాటకులకు సరికొత్త అనుభూతి పంచేలా విశాఖ ఆర్కే బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ఏర్పాటు చేస్తున్నారు.

8లో



భిన్న వాతావరణం

మన్యంలో గురువారం ఉదయం పొగమంచు దట్టంగా కురిసింది. మధ్యాహ్నం భానుడు ప్రతాపం చూపడంతో జనం అల్లాడిపోయారు.

న్యూస్‌రీల్

నాతవరం జెడ్పీ హైస్కూల్ జూనియర్ కాలేజీగా అప్‌గ్రేడ్



జీవో కాపీని చూపుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: నాతవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఎన్నో ఏళ్లగా కాలేజీ లేక ఆ మండలానికి చెందిన విద్యార్థులు నర్సీపట్నం రావాల్సి వచ్చేదన్నారు. కళాశాలను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరామని, ఆయన ఆదేశాల మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హైస్కూల్‌ను కళాశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ ప్రాంత ప్రజల తరపున సీఎంకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

దుకాణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

తుమ్మపాల: మార్కెట్‌లో ప్రతి దుకాణం, సంస్థల నిర్వాహకులు కార్మిక శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ పత్రాన్ని తప్పనిసరిగా కలిగి ఉండాలని కార్మిక శాఖ జిల్లా సహాయ కమిషనర్ కె.వసంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు/గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. ఈ నెల 29వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

నేడు చోడవరంలో మినీ జాబ్ మేళా

అనకాపల్లి: నిరుద్యోగులకు ఉపాధి కల్పనలో భాగంగా చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం ఉదయం 10గంటలకు మినీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి టి.చాముండేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కిమ్స్ (కోనసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) ఆస్పత్రిలో వివిధ విభాగాల్లో పనిచేయుటకు ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే నిరుద్యోగులు ఇంటర్, నర్సింగ్ పూర్తి చేసి 18 నుంచి 27 ఏళ్ల వయస్సు కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7036363272 సంప్రదించాలన్నారు.

ఆంధ్రా పెరియార్ ఇకలేరు

- భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకుడు జయగోపాల్ కన్నుమూత



జయగోపాల్ పార్థివదేహం ఏఎంసీకి అప్పగింత

ఆరిలోవ/మహారాణిపేట: భారత నాస్తిక సమాజం(బానాస) వ్యవస్థాపకుడు, అంతర్జాతీయ మానవ హక్కుల నేత, ఆంధ్రా పెరియార్‌గా పేరుగాంచిన డాక్టర్ జయగోపాల్(80) అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జయగోపాల్ 1972లో ఫిబ్రవరి 13న నాస్తిక సమాజం ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో ఎనిమిది రాష్ట్రాల్లో నాస్తిక, హేతువాద ఉద్యమ వ్యాప్తి కోసం విశేష కృషి చేశారు. అంతర్జాతీయ స్థాయిలో మానవ హక్కుల కార్యకర్తలకు అండగా నిలిచి ఉద్యమాలు చేపట్టారు. 52 ఏళ్ల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల, మత, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి వాటి నిర్మూలనకు కృషి చేశారు. దళితులపై దాడులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేపట్టారు. నాస్తిక సమాజంలో ఆయన కృషికి గానూ అంతర్జాతీయ బ్రేవ్ మైండ్ అవార్డును అందుకుని.. దేశంలోనే మొదటి వ్యక్తిగా నిలిచారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్, భౌతికవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం కోసం అనేక రచనలు చేశారు

హృదయం పదిలం



- గుండెపోటుకు తక్షణ చికిత్స అందించే స్టెమీ రూమ్‌లు
- జిల్లాలోని 8 ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు
- గోల్డెన్ అవర్‌లో ఉచితంగా రూ.46 వేల విలువైన ఇంజక్షన్
- హృద్రోగులకు వైఎస్ జగన్ సర్కారు భరోసా



ఎస్.రాయవరం మండలం గుర్రాజుపేటకు చెందిన అందిబోయిన సత్తిబాబు కొబ్బరి కాయలు తీస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి గత ఏడాది నవంబర్ 8న ఛాతిలో నొప్పి వచ్చింది. ఆ రోజు రాత్రి నొప్పి ఎక్కువ కావడంతో మర్నాడు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ ఈసీజీ తీసి, పరిస్థితి విషమంగా ఉండడంతో టెనెక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్ ఇచ్చారు. మెరుగైన చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌కు అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ కార్డియాలజీ విభాగంలో అవసరమైన శస్త్రచికిత్స చేయడంతో కోలుకున్నాడు. సకాలంలో ఇంజక్షన్ చేసి తమ వద్దకు తీసుకురావడం వల్ల ప్రాణాపాయం తప్పిందని కేజీహెచ్ వైద్యులు చెప్పారు.

యలమంచిలి రూరల్/నక్కపల్లి: గుండె శరీరంలో చాలా ప్రధానమైన అవయవం. చాలా సున్నితమైనది. ఏ క్షణానికి ఎలా స్పందిస్తుందో ఎవరికీ తెలీదు. హృద్రోగం రకరకాలుగా వస్తుంది. కొన్ని రకాల గుండె సమస్యలను లక్షణాలను బట్టి ముందుగా గుర్తించవచ్చు. వారు సకాలంలో వైద్యుడిని సంప్రదిస్తే సరిపోతుంది. గుండెపోటు వస్తే మాత్రం వెంటనే స్పందించాలి. 'గోల్డెన్ అవర్'లో ఆస్పత్రికి తీసుకువెళితే బతికే అవకాశం ఉంటుంది. అలాంటి స్థితిలో ఉన్న వారికి తక్షణం ఉన్నత వైద్యం అందించేలా పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్టెమీ రూమ్‌లను ఏర్పాటు చేశారు. వైద్య రంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.46 వేల విలువ చేసే టెనెక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్ అక్కడ అందుబాటులో ఉంచుతోంది. అవసరమైన రోగులకు ఉచితంగా ఇంజక్షన్ చేస్తారు. గత అక్టోబరు నెలలో ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఏడుగురికి, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో ఆరుగురికి, నక్కపల్లిలో ఇద్దరికి అత్యవసర చికిత్స అందజేశారు. కోలుకున్న వారంతా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

స్టెమీ రూమ్ అంటే..

గుండెలోని ధమనులు పూర్తిగా పూడుకుపోతే వచ్చే అతి ప్రమాదకరమైన గుండెపోటును ఎస్‌టీ ఎలివేషన్ మయోకార్డియల్ ఇన్‌ఫార్‌క్షన్ (స్టెమీ) అంటారు. గుండెపోటు వచ్చినపుడు సకాలంలో సరైన చికిత్స అందక గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న వారే ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సీహెచ్‌సీల్లోనూ స్టెమీ రూమ్‌లను ఏర్పాటు చేసి, టెనెక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్లను అందుబాటులో ఉంచుతోంది. హార్ట్‌ఎటాక్ వచ్చిన వారిని నిమిషాల్లో రూమ్‌కు తరలించి ఆగిపోయే గుండెను కొట్టుకునేలా చేస్తారు. హృద్రోగి స్పృహలోకి వచ్చేందుకు డిఫిబ్రిలేటర్ (షాక్) ఇస్తారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, యలమంచిలి, నక్కపల్లి, కోటవురట్ల, చోడవరం, కె.కోటపాడు, మాడుగుల సీహెచ్‌సీలు, అనకాపల్లి జిల్లా ఆస్పత్రిలో స్టెమీ రూములను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లకు 12 లీడ్స్ ఉండే ఈసీజీ పరికరం అందజేశారు. ఐసీయూ బెడ్, ఐవీ స్టాండ్, మల్టీ పారామానిటర్, స్టెమీ సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేసిన కంప్యూటర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్రత్యేక వైద్య సిబ్బంది, ప్రత్యేక మొబైల్ ఫోన్ కేటాయించారు. గుండె నొప్పితో గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి వచ్చిన రోగిని స్టెమీ రూమ్‌కు తరలించి ఈసీజీ తీస్తారు. ఆ రిపోర్టును స్టెమీ వాట్సాప్ గ్రూపులో అప్‌లోడ్ చేస్తారు. ఇలా చేసిన వెంటనే రెండు నిమిషాల్లో ఆ రిపోర్టు వివరాలు విశాఖ కేజీహెచ్‌లోని హబ్‌కు చేరుతాయి. అక్కడున్న గుండె వైద్య నిపుణులు రిపోర్ట్ చూసి, ఎలాంటి చికిత్స చేయాలో ఆ యాప్‌లోనే సూచిస్తారు. దీని ఆధారంగా ఇక్కడి వైద్యులు, సిబ్బంది రోగికి చికిత్స అందజేస్తారు. అత్యవసరమైన వ్యక్తికి స్టెమీ రూమ్‌లోనే టెనెక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్ ఇస్తారు. తరువాత హబ్‌కు రిఫర్ చేస్తారు. అక్కడ అవసరం మేరకు రోగికి శస్త్రచికిత్స చేసి స్టంట్స్ వేయడం వంటివి చేస్తారు. గోల్డెన్ అవర్‌లో ప్రాణాలు నిలబెట్టే ఈ ఇంజక్షన్ ఖరీదు రూ.46 వేలు. ప్రభుత్వం సబ్సిడీతో రూ.23 వేలకే ప్రభుత్వ ఆస్పత్రులకు ఇస్తోంది. రోగులకు ఉచితంగా ఇంజక్షన్ ఇస్తున్నారు. ఇలాంటి ఇంజక్షన్లు ప్రతి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రెండు, ఏరియా ఆస్పత్రిలో 5 చొప్పున అందుబాటులో ఉంచారు.




అనకాపల్లి, నక్కపల్లి ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన స్టెమీరూమ్‌లు



యలమంచిలి ఆస్పత్రిలో హృద్రోగిని పరీక్షిస్తున్న వైద్యులు



అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో స్టెమీ రూమ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బెడ్లు



రూ.46 వేల విలువైన టెనెక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్

ఉచితంగా ఖరీదైన వైద్యం



కరోనా తర్వాత వయసుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గుండె జబ్బు నివారణకు చర్యలు తీసుకుంది. స్టెమీ కార్యక్రమం ద్వారా పల్లె ప్రాంతాల్లో ప్రజలకు కూడా గుండె జబ్బుకు చికిత్స అందిస్తోంది. ఖరీదైన వైద్యాన్ని ప్రభుత్వం పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చింది.

–డాక్టర్ లక్ష్మణ్ శ్రీనివాస్, ఎమర్జెన్సీ కార్డియాక్ కేర్ నోడల్ అధికారి

తొలి 40 నిముషాలే కీలకం



గుండెపోటు సంభవించిన తొలి 40 నిమిషాల సమయం ఎంతో కీలకం. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే రోగి ప్రాణాలు కాపాడవచ్చు. యలమంచిలి సీహెచ్‌సీలో మూడు నెలల నుంచి టెనెక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయి. రక్తనాళాలు బ్లాక్ అయి గుండెపోటుకు గురైనపుడు ఈ ఇంజక్షన్ వినియోగిస్తాం.

–డాక్టర్ ఆర్.నిహారిక, సివిల్ అసిస్టెంట్ సర్జన్, యలమంచిలి సీహెచ్‌సీ

ఆపత్కాలంలో సంజీవిని



నక్కపల్లి ఆస్పత్రిలో అన్ని సదుపాయాలతో స్టెమీ రూమ్ ఏర్పాటు చేశాం. ఒక లారీ క్లీనర్ గుండె నొప్పి వస్తోందంటూ ఆస్పత్రిలో కుప్పకూలిపోయాడు. వెంటనే అతనిని స్టెమీరూమ్‌లోకి చేర్చి ఈసీజీ తీసి కేజీహెచ్ కార్డియాలజీ నిపుణుల ద్వారా హార్ట్ ఎటాక్ అని నిర్ధారించాం. వెంటనే టెనెక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్ ఇచ్చాం. పూర్తిగా కోలుకొని తన పనులు చేసుకుంటున్నాడు.

–డాక్టర్ ఈశ్వర ప్రసాద్, సూపరింటెండెంట్, నక్కపల్లి ఏరియా ఆస్పత్రి

మహా క్రీడా సంబరం

- నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్రా' తుది పోటీలు
- ఐదు క్రీడాంశాల్లో తలపడనున్న 26 జిల్లాల జట్లు
- సీఎం జగన్ చేతులమీదుగా బహుమతుల ప్రదానం

విశాఖ సిద్ధం



ప్రారంభ వేడుకకు సిద్ధమైన రైల్వే స్టేడియం

విశాఖ స్పోర్ట్స్: మహా క్రీడా సంబరానికి విశాఖ సర్వం సిద్ధమైంది. గ్రామీణస్థాయి నుంచి యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా ప్రారంభించిన మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా'తుది ఘట్టానికి చేరుకుంది. నాలుగు దశల్లో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీలకు విశేష స్పందన రాగా.. జిల్లా స్థాయిలో సత్తా చాటిన జట్లతో రాష్ట్ర స్థాయి పోటీలకు మరికొన్ని గంటల్లో తెరలేవనుంది. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు మహా సంగ్రామం జరగనుంది. చెన్నై సూపర్ కింగ్స్ జట్టు, ప్రో కబడ్డీ జట్టుకు శిక్షణాపరమైన సహకారం అందించిన నిపుణులు ఈ పోటీలను వీక్షించేందుకు రానుండటంతో మరింత ప్రాధాన్యం నెలకొంది. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లను ఎంపిక చేసి, వీరితో ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది.

40 బస్సులు సిద్ధం : జిల్లా స్థాయిలో విజయం సాధించిన జట్లు ఇప్పటికే విశాఖ చేరుకున్నాయి. ప్రతీ జిల్లా నుంచి 134 మంది చొప్పున మెన్, వుమెన్ పోటీలకు హాజరవుతున్నారు. రైళ్లలో కొందరు, బస్సుల్లో మరికొందరు విశాఖలో ఏర్పాటు చేసిన బస ప్రాంతానికి చేరుకున్నారు. రైళ్లలో వచ్చిన వారిని ప్రభుత్వం ఏర్పాటు చేసిన బస్సుల్లో బస వద్దకు చేర్చారు. ఐదు రోజుల పాటు క్రీడాకారులను బస ప్రాంతం నుంచి మైదానాల వద్దకు తరలించేందుకు 40 బస్సులను సిద్ధం చేశారు.

జేసీపీ పర్యవేక్షణలో భద్రత : మెన్ జట్లకు దబ్బంద, వుమెన్ జట్లకు సుద్దగెడ్డ, కొమ్మాదిలోని టిడ్కో గృహాల్లో వసతి సౌకర్యం కల్పించారు. మహిళలకు ఏర్పాటు చేసిన బస వద్ద జాయింట్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో భద్రత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం ప్రారంభ వేడుక జరగనుండగా.. మధ్యాహ్నం నుంచి పోటీలు ప్రారంభం కానున్నాయి. ఉదయం అల్పాహారం, రాత్రి భోజనం వసతి కల్పించిన చోటే అందిస్తారు. మధ్యాహ్న భోజనం క్రీడా ప్రాంగణాల వద్ద అందజేయనున్నారు. పోటీలు జరిగే సమయంలో క్రీడాకారులకు స్నాక్స్, ఎనర్జీ డ్రింక్స్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. వసతి ప్రాంతాల్లో అన్ని సౌకర్యాలు కల్పించారు. మొబైల్ టాయిలెట్లు సిద్ధం చేశారు.

రాష్ట్ర స్థాయి విజేతలకు బహుమతులు ఇలా..

క్రీడ	ప్రథమ	ద్వితీయ	తృతీయ
క్రికెట్	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2లక్షలు
వాలీబాల్	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2 లక్షలు
కబడ్డీ	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2లక్షలు
ఖోఖో	రూ.5లక్షలు	రూ.3లక్షలు	రూ.2 లక్షలు
బ్యాడ్మింటన్	రూ.2లక్షలు	రూ.లక్ష	రూ.50వేలు

మైదానాలు ఇవే..

రాష్ట్ర స్థాయిలో పోటీపడేందుకు 1,482 మంది పురుషులతో పాటు 1,482 మంది మహిళలు విశాఖ తరలివచ్చారు. పోటీలకు నగరంలోని మైదానాలను సిద్ధం చేశారు.

వుమెన్ క్రికెట్	వైఎస్సార్ జీ గ్రౌండ్
మెన్ క్రికెట్	రైల్వే స్టేడియం, ఏఎంసీ మైదానం, కొమ్మాది కె.వి.కె స్టేడియం
కబడ్డీ, ఖోఖో	ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానం
వాలీబాల్	ఏయూ సిల్వర్ జూబ్లీ మైదానం
బ్యాడ్మింటన్	జీవీఎంసీ ఇండోర్ స్టేడియం

ఆడుదాం ఆంధ్రాకు ఏర్పాట్లు పూర్తి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి క్రీడా సంబరానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ ఎ.మల్లికార్జున వెల్లడించారు. కలెక్టరేట్‌లో పోలీస్ జాయింట్ కమిషనర్ ఫకీరప్పతో కలసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 9న రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా పోటీలు ప్రారంభిస్తారని, 13న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

రాజ్యసభలోనూ ఉత్తరాంధ్రకే పెద్దపీట

- వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావులకు అవకాశం





సాక్షి విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఉత్తరాంధ్ర పక్షపాతి అని నిరూపించారు. రాష్ట్రంలో మూడు రాజ్యసభ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైతే అందులో రెండు ఉత్తరాంధ్రకే కేటాయించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును రాజ్యసభ అభ్యర్థులుగా ప్రకటించారు. దీనిపై ఉత్తరాంధ్ర ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వైవీ సుబ్బారెడ్డి..

వైవీ సుబ్బారెడ్డిది ప్రకాశం జిల్లా మేదరమెట్ల. తల్లిదండ్రులు ఎర్రం చిన్నపోలిరెడ్డి, పిచ్చమ్మ. షోలాపూర్‌లో భారతీ విద్యాపీఠ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఎంబీఏ(మార్కెటింగ్ అండ్ ఫైనాన్స్) పూర్తి చేశారు. 2014 సాధారణ ఎన్నికల్లో ఒంగోలు లోక్‌సభ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించి 16వ లోక్‌సభలో అడుగుపెట్టారు. పరిశ్రమల స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా, ప్రైవేట్ బిల్లుల, తీర్మానాల కమిటీలో సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుల స్థానిక ప్రాంత అభివృద్ధి పథకాల(ఎంపీ ల్యాడ్స్) కమిటీ, ఆర్థిక కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో కాన్సులేటివ్ కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. ప్రత్యేక హోదా కోసం 2018లో లోక్‌సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. 2019 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. వైఎస్సార్ సీపీలోనూ పలు పదవులు నిర్వర్తించారు. గతంలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్నారు.

గొల్ల బాబూరావు..


నక్కపల్లి: విధేయత, విశ్వసనీయతకు గుర్తింపుగా సీఎం వైఎస్ జగన్ పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం కల్పించారు. గ్రూప్ 1 అధికారిగా పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ స్థాయి వరకు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన బాబూరావు మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. 2009లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి పోటీ చేశారు. అక్కడ ముప్పై ఏళ్ల టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టి తొలిసారిగా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురు వేశారు. కొద్ది నెలలకే వైఎస్సార్ దుర్మరణం పాలవ్వడంతో తదనంతర పరిణామాల్లో జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీని స్థాపించారు. జిల్లాలో బాబూరావు ఒక్కరే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి జగన్ వెంట నడిచారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా కూడా పనిచేశారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున అమలాపురం ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో తిరిగి పాయకరావుపేట ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎస్సీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా కూడా వ్యవహరిస్తున్నారు.ఎ కష్టకాలంలో తనతో ఉండి తన కుటుంబానికి అండగా నిలిచిన బాబూరావుకు జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారు. పెద్దల సభకు పంపించి బాబూరావుపై తనకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. రాజ్యసభ సభ్యునిగా తనను ఎంపిక చేసిన సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు.

విద్యుదాఘాతం దురదృష్టకరం

- మృతి చెందిన విద్యార్థి కుటుంబాన్ని ఆదుకుంటాం
- బాధితులను పరామర్శించిన రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్మన్ శంకరరావు

గొలుగొండ: విద్యుత్‌షాక్‌తో కొడుకును పోగొట్టుకున్న కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, జరిగిన సంఘటనపై పూర్తి విచారణ చేస్తామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు తెలిపారు. ఆయన గొలుగొండ మండలంలో గురువారం పర్యటించారు. ఈనెల 4వ తేదిన జోగుంపేట ఎస్సీ వసతి గృహంలో గొలుగొండ మండలం బుడ్డడపాడు గ్రామానికి చెందిన ఎస్టీ విద్యార్థి తూబిరి దావీద్‌రాజు (14) విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సంఘటన తెలిసిందే. రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్మన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముందుగా ఎస్సీ వసతిగృహం వద్దకు వెళ్లి పరిశీలించి, ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకున్నారు. బుడ్డడపాడు వెళ్లి మృతుడు దావీద్‌రాజ్ తల్లిదండ్రులు బాలరాజు, రమణమ్మ దంపతులను ఓదార్చారు. దావీద్‌రాజు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్టీ సెల్ చైర్మన్ శంకరరావు విలేకర్లతో మాట్లాడుతూ ఈ దుర్ఘటన చాలా బాధాకరమని, ఇటువంటి సంఘటలను ఎక్కడా జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. దావీద్‌రాజు కుటుంబానికి భూమి, ఉద్యోగం ఇవ్వాలని స్థానికులు కోరగా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఆదుకుంటామన్నారు.

గ్రామ సమస్యలపై స్థానిక గిరిజనులు దరఖాస్తులు చేసుకోగా వాటిని పరిశీలిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం, రూరల్ సీఐ బి.హరి, ఎస్‌ఐ కృష్ణారావు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, వైస్ ఎంపీపీ నాగమణితో పాటు జిల్లా ట్రైబుల్ వెల్ఫేర్ అధికారి నాగ శిరీష, పాత మల్లంపేట సర్పంచ్ ఆదిలక్ష్మి తదితర్లు పాల్గొన్నారు.



బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న రాష్ట్ర ఎస్టీ సెల్ చైర్మన్ శంకరరావు

అల్లూరికి నివాళి

ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు కృష్ణదేవిపేట ప్రాంతంలో ఉన్న అల్లూరి సమాధుల వద్ద ఘన నివాళులర్పించారు. దేశ స్వాంతంత్య్రం కోసం అమాయక గిరిజన ప్రజల విముక్తి కోసం పోరాటం చేసి చిన్న వయస్సులో ప్రాణాలు అర్పించిన అల్లూరికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు. సర్పంచ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

రావికమతం: మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఢిల్లీ) బృందం సభ్యులు గురువారం మండలంలోని చీమలపాడు, టి.అర్జాపురం గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఆ బృందం సభ్యులు సంజాలి గుప్తా, అనిల్ పన్వీతో పాటు డ్వామా పీడీ సందీప్ ముందుగా చీమలపాడు పంచాయతీలోని తాటిపర్తి, రొచ్చుపణుకు గ్రామాల్లో చేపట్టిన బౌండరీ ట్రెంచ్ తవ్వకాలు, కందకాల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు అప్‌డేట్ అయ్యాయా లేదా అని ఆరా తీశారు. రోజుకు ఎంత కూలి గిట్టుబాటయ్యిందని తెలుసుకున్నారు. కొన్ని పనులు బాగానే ఉన్నా మరి కొన్ని పనులు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం కన్పించడం లేదని అధికార్లను ప్రశ్నించగా గిరిజన గ్రామాల్లో సిగ్నల్ వ్యవస్థ, పోర్టల్‌లో క్షేత్ర స్థాయిలో తలెత్తుతున్న చిన్నపాటి సాంకేతిక సమస్యలే కారణమని వివరించారు. టి.అర్జాపురం గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్లు, హౌసింగ్ పనులను పరిశీలించి జాబ్‌కార్డుదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మాడుగుల, యలమంచిలి, అనకాపల్లి క్లస్టర్ ఏపీడీలు శ్రీనివాస్, కె.శ్రీనివాసరావు, మణికుమార్, రావికమతం ఏపీవో కాశిఅప్పారావు పాల్గొన్నారు.



తాటిపర్తిలో జీడితోటల్లో చేపట్టిన కందకాలు, ట్రెంచ్ పనులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

అలలపై సయ్యాట

- పర్యాటకులకు సరికొత్త అనుభూతి పంచేలా బీచ్‌లో ఫ్లోటింగ్ బ్రిడ్జ్
- కేరళలో బ్రిడ్జ్‌లను పరిశీలించిన నిపుణులు, అధికారుల బృందం
- సముద్ర అధ్యయన శాస్త్రవేత్తల సూచనలతో సబ్‌మెరైన్ ప్రాంతంలో ఏర్పాటు
- ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకొనేలా భద్రతా ప్రమాణాలతో నిర్మాణం
- పీపీపీ విధానంలో రూ.కోటితో బ్రిడ్జ్. తుది దశకు పనులు
- బ్రిడ్జ్ చుట్టూ 2 పడవలతో గస్తీ. 10 మంది గజ ఈతగాళ్లతో రక్షణ వలయం



నిర్మాణంలో ఉన్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్



విశాఖ సిటీ: అలలపై సయ్యాట ఆడే సమయం ఎంతో దూరంలో లేదు. పర్యాటకులకు సరికొత్త అనుభూతిని పంచే ప్రాజెక్టు త్వరలోనే అందుబాటులోకి రానుంది. కేరళ రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లో ప్రపంచ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్న ఫ్లోటింగ్ బ్రిడ్జ్.. విశాఖ సాగరతీరంలో కూడా సిద్ధమవుతోంది. సముద్ర అధ్యయన శాస్త్రవేత్తల సూచనలతో.. బీచ్ రోడ్డులో కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియానికి సమీపంలో ఫ్లోటింగ్ వీఎంఆర్‌డీఏ అధికారులు బ్రిడ్జ్ నిర్మాణాన్ని చేపట్టారు. ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకొనేలా పూర్తి భద్రతా ప్రమాణాలతో పర్యాటకులను మంత్రముగ్ధులను చేసే ప్రాజెక్టు దాదాపుగా తుది దశకు చేరుకుంది.

పీపీపీ విధానంలో..

విశాఖను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రపంచ పర్యాటకలను ఆకర్షించే విధంగా ప్రాజెక్టులకు రూపకల్పన చేయాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో వీఎంఆర్‌డీఏ కై లాసగిరిపై రివాల్వింగ్ రెస్టారెంట్, హిల్‌టాప్ రిసార్ట్, గ్లాస్ బ్రిడ్జ్, ఫ్లోటింగ్ బ్రిడ్జ్ వంటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. పీపీపీ విధానంలో ఈ ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించి ఇ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. ఇందులో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ టెండర్‌ను సాయి మోక్షా షిప్పింగ్ అండ్ లాజిస్టిక్స్ సంస్థ దక్కించుకుంది. వీఎంఆర్‌డీఏకు ఏడాదికి రూ.15.3 లక్షలు ముందస్తు చెల్లింపుల ప్రతిపాదికన ఈ ప్రాజెక్టును చేపట్టింది.

శాస్త్రవేత్తలు, నిపుణుల సూచనలతో..

వాస్తవానికి ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌ను తెన్నేటి పార్క్ వద్ద ఏర్పాటు చేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు భావించారు. అయితే ఆ ప్రాంతం అటవీ శాఖకు చెందినది కావడంతో అక్కడ విరమించుకున్నారు. రుషికొండ ప్రాంతంలో బ్రిడ్జ్ నిర్మాణంపై వీఎంఆర్‌డీఏ అధికారులు ఆంధ్రా యూనివర్సిటీలో సముద్ర అధ్యయన, భూభౌతిక శాస్త్రవేత్తలను సంప్రదించారు. రుషికొండలో ప్రాణాంతకమైన రిప్ కరెంట్ అధికంగా ఉంటుందని, ప్రాజెక్టుకు సానుకూలం కాదని చెప్పారు. అలాగే కురుసుర మ్యూజియం ఉత్తర దిశ ప్రాంతం ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌కు అనుకూలమైనదని సూచించారు.

కేరళలో పరిశీలించి..

దేశంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్ కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో మాత్రమే ఉన్నాయి. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారుల బృందం కేరళ రాష్ట్రంలోని కాలికట్ వద్ద బేపూర్ తీరంలోను, త్రిశూర్ నగరంలో చావక్కడ్ తీరంలో ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌లను సందర్శించారు. అధికారులు, నిర్మాణ నిర్వహణదారులతో మాట్లాడి అక్కడ ప్రాజెక్టు విధానాలు తెలుసుకున్నారు. కేరళలో ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌లు ప్రపంచ పర్యాటకులకు విశేషంగా ఆకట్టుకుంటున్న విషయాన్ని గమనించారు. ఏర్పాటు చేసిన ప్రతి చోటా విజయవంతంగా నడుస్తున్నట్లు గుర్తించారు.

పర్యాటకుల భద్రత కోసం..

- సముద్రం అలలకు తగ్గట్టుగానే ఫ్లోటింగ్ బ్రిడ్జ్ ప్రతిస్పందిస్తుంటుంది.
- దానిపై నడిచే వారు అందుకు తగ్గట్టుగా సరికొత్త అనుభూతిని పొందుతారనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.
- పర్యాటకాభివృద్ధి చేపట్టిన ఈ ప్రాజెక్టులో పర్యాటకుల భద్రతపై కూడా వీఎంఆర్‌డీఏ అధికారులు దృష్టి సారించారు.
- ఫ్లోటింగ్ బ్రిడ్జ్ చుట్టూ రెండు పడవలతో నిర్వాహకులు నిరంతం గస్తీ నిర్వహించనున్నారు.
- సందర్శకుల భద్రత నిమిత్తం 10 మంది గజ ఈతగాళ్లను నియమించనున్నారు.
- వారి పర్యవేక్షణలో మాత్రమే వంతెనపై సందర్శనకు అనుమతిస్తారు.
- ప్రతి సందర్శకుడికి లైఫ్ జాకెట్ అందజేస్తారు. అది ధరించకపోతే అనుమతించరు.
- అలాగే బ్రిడ్జ్ చుట్టూ లైఫ్‌గార్డులను రక్షణ వలయంగా ఉంటారు.
- మరో వారం రోజుల్లో ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది.
- ఆ తరువాత పూర్తి స్థాయిలో పరిశీలన అనంతరమే సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.

పూర్తి భద్రతా ప్రమాణాలతో..

- సబ్‌మెరైన్ మ్యూజియం ప్రాంతానికి సమీపంలో పూర్తి భద్రతా ప్రమాణాలతో బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.
- ముంబయి నుంచి వచ్చిన ఫ్లోటింగ్ బ్రిడ్జ్ నిర్మాణ నిపుణులతో ప్రతికూల వాతావరణాన్ని సైతం తట్టుకొనేలా ప్రాజెక్టును నిర్మిస్తున్నారు.
- ఒకేసారి 200 మంది సామర్థ్యాన్ని తట్టుకొనేలా బలమైన యాంకర్లతో పటిష్టంగా హెచ్‌డీపీఈ బ్లాక్‌లతో బ్రిడ్జ్ నిర్మాణం చేపడుతున్నారు.
- మొత్తం 100 మీటర్లు ఉండే ఈ బ్రిడ్జ్‌లో 20 మీటర్లు తీరం ఒడ్డున, 80 మీటర్లు సముద్రంపై ఉంటుంది.
- తాత్కాలిక నిర్మాణమైన ఈ బ్రిడ్జ్‌లో వినియోగించిన బ్లాకులు, యాంకర్లు, ఇతర సామగ్రి పూర్తిగా పర్యావరణ సానుకూలమైనవి.

శాస్త్రీయ అధ్యయనం చేసి..



శాస్త్రీయ అధ్యయనం చేసి ఫ్లోటింగ్ బ్రిడ్జ్‌కు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేయడం జరిగింది. పర్యాటకాభివృద్ధికే కాకుండా సందర్శకుల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించాం. పూర్తి భద్రతా ప్రమాణాలతో పర్యాటకులకు సరికొత్త అనుభూతి అందించాలన్న ఉద్దేశంతో పీపీపీ విధానంలో బ్రిడ్జ్‌ను ఏర్పాటు చేస్తున్నాం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, వీఎంఆర్‌డీఏ కమిషనర్

విశాఖ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు..



ప్రతిపక్షాలు, పచ్చమీడియా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఒకవైపు కోర్టు కేసులు, అవాస్తవ కథనాలు రాసి అడ్డుకుంటూనే మరోవైపు అభివృద్ధి జరగడం లేదని తప్పుడు ఆరోపణ చేస్తున్నాయి. విశాఖలో పర్యాటకాభివృద్ధికి వీఎంఆర్‌డీఏ శాస్త్రీయ అధ్యయనం చేసిన తరువాత ప్రాజెక్టులను చేపడితే వాటిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. విశాఖలో అభివృద్ధిని చూసి ఓర్వలేక బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు, పచ్చమీడియా ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటన్నింటినీ అధిగమించి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విశాఖను మెట్రో నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తారు.

– ఎం.వి.వి.సత్యనారాయణ, విశాఖ ఎంపీ

కులగణన గడువు 12 వరకు పొడిగింపు

మహారాణిపేట: కులగణన గడువును ఈ నెల 12వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించింది. జనవరి 19వ తేదీన ఈ కార్యక్రమం ప్రారంభమైన సంగతి తెలిసిందే. 12 వరకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. ఆ సమయంలో అందుబాటులో లేని వారు ఈ నెల 17వ తేదీ లోగా సచివాలయాలకు వెళ్లి వివరాలు అందజేయవచ్చు.

Collector's Office, Anakapalli

Rc.No.22/2024/SA-2(Elections), Dated 08/02/2024

SHORT TENDER NOTICE

Sealed tenders are invited from authorized dealers / agencies for supply of Computers / Printers etc. for the ensuing General Elections to House of People /APLA-2024. Detailed specifications required for supply of these items as shown below. Interested authorized dealers / agencies are requested to file sealed tender in Collector's Office, Anakapalli during office hours on or before 14-02-2024.

Requirement of Computers and Printers for the use in the Office of the Collector and District Election Officer, Anakapalli for the ensuing General Elections to HOP / APLA -2024.

Sl. No	Item	Specifications	Qty required
1	Computers	Provision: ONE SYSTEM with the following minimum configuration a) 32 GB RAM i7 Processor with 1 TB SSD Preloaded Windows OS.	1
		Provision: b) TB external Hard disk for taking regular backups	1
2	Computers	Provision: 8 GB RAM Intel Core i5 512 GB SSD with key board / Mouse, Monitor 20"	10 or more
3	High Speed Laser Printer cum scanner	Provision: c) One High End Network Printer to take Printouts of Check Lists, Reports etc.	1

Terms and conditions:
1. They should deposit Rs.10,000/- as EMD in the shape of Demand Draft in favour of the Collector & District Election Officer,Anakapalli.
2. The items shall be delivered within (7) days from the date of issue of purchase order as per the specifications mentioned above. Separate instructions will be issued for delivery of items.
3. The Election Authority has every right to cancel the order, if the material is not supplied within time.
4. The amount will be made against delivery.

K V L N Murthy, Nodal Officer and District Civil Supply Officer, Anakapalli

థియేటర్ వద్ద 'యాత్ర' సందడి



థియేటర్ వద్ద కేక్ కట్ చేస్తున్న చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: యాత్ర–2 సినిమా రిలీజ్‌తో స్థానిక థియేటర్ వద్ద సందడి నెలకొంది. ఈ సినిమాను తిలకించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా థియేటర్ వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు. ముందుగా మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

తుమ్మపాల: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లాలోని అంగన్‌వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో శుక్రవారం విద్యార్థులకు, కౌమార బాల బాలికలకు అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా వేయనున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి రెండేళ్ల లోపు పిల్లలకు సగం మాత్ర నీటిలో కరిగించి తాగించాలన్నారు. రెండు నుంచి మూడేళ్లలోపు పిల్లలకు పూర్తి మాత్ర, మూడు నుంచి పదేళ్ల వయసు గల వారు మాత్రను చప్పరించేటట్లు చూడాలన్నారు. మధ్యాహ్నం భోజనం పూర్తయి 30 నిమిషాల తర్వాత మాత్రలు వేయాలన్నారు. 9వ తేదీన అందుబాటులో లేనివారికి ఈ నెల 16న తప్పక మాత్ర వేయాలని సూచించారు. రెండో త్రైమాసికంలో గర్భిణులకు 400 ఎంజీ ఇవ్వాలన్నారు. మాత్రను చప్పరించడం వల్ల ఎటువంటి దుష్పరిణామాలు కలగవని తెలిపారు.

బాల నేరస్తులకు న్యాయ సహాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శేషమ్మ

అనకాపల్లి: అనాలోచిత నిర్ణయాలతో తప్పులు చేస్తున్న బాల నేరస్తులకు సరైన న్యాయ సహాయం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ తెలిపారు. పాన్ ఇండియా క్యాంపెయిన్ ఫర్ ఐడెంటిఫైడ్ జువెనైల్స్ ఇన్ ప్రిజన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సబ్ జైలును ఆమె పలువురు న్యాయవాదులతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ న్యాయ సహాయం అవసరమైన వారిని గుర్తించాలన్నారు. సబ్‌జైలును ప్యానల్ అడ్వకేట్లు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. నేరస్తులకు అందిస్తున్న ఆహార వివరాలను జైలు సూపరింటెండెంట్ గణేష్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు కె.సాయిరాం, తులసి, ఎంఎల్ఎస్‌సీ ప్రతినిధి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు అప్పన్న తెప్పోత్సవం

- ముస్తాబైన వరాహ పుష్కరిణి
- వేణుగోపాలస్వామి అలంకారంలో దర్శనమివ్వనున్న అప్పన్న



వేణుగోపాలస్వామి అలంకారంలో అప్పన్న(ఫైల్)

సింహాచలం: పుష్యబహుళ అమావాస్యని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి తెప్పోత్సవం(నౌకావిహారం) శుక్రవారం సాయంత్రం కొండదిగువ వరాహ పుష్కరిణిలో జరగనుంది. స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు సింహగిరి నుంచి కొండ దిగువకు మెట్లమార్గంలో తీసుకొస్తారు. కొండదిగువన ఉన్న పుష్కరిణి వద్ద హంస వాహనంపై స్వామిని వేంజేపచేసి సాయంత్రం 5.30 గంటల నుంచి తెపోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం స్వామిని పుష్కరిణి సత్రం వద్దకు తీసుకొస్తారు. అక్కడ సర్వజనమనోరంజని వాహనంపై స్వామిని అధిష్ఠించి రాత్రి అడవివరంలో గ్రామ తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం రాత్రి స్వామిని తిరిగి సింహగిరికి చేరుస్తారు.

విజయవంతంగా ట్రయల్ రన్

తెప్పోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధం చేసిన హంసాకార తెప్పపై గురువారం సాయంత్రం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ట్రయల్‌రన్ నిర్వహించారు. గోపాలపట్నం సీఐ సురేష్, ఎస్ఐలు అప్పలరాజు, రామకృష్ణ, శ్రీనివాసరావు, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, డీఈ నాగేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.

విశేషంగా ఏర్పాట్లు

తెపోత్సవాన్ని పురస్కరించుకుని అన్నిశాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈవో తెలిపారు. తెప్పని హంసాకృతిలో తీర్చిదిద్దామన్నారు. పుష్కరిణి వద్ద దేవస్థానం తరపున 10 మంది గజ ఈతగాళ్లను, రెండు అదనపు బోట్లను, లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. అడవివరానికి చెందిన మరో 15 మంది గజఈతగాళ్లు సేవలందిస్తారన్నారు. అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉంటుందన్నారు.

వందమందితో పోలీస్ బందోబస్తు

5వేల మంది వరకు భక్తులు తెప్పోత్సవం తిలకించేందుకు వస్తారని అంచనా వేసినట్లు నార్త్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి తెలిపారు. వంద మంది వరకు లా అండ్ ఆర్డర్, క్రైమ్, ట్రాఫిక్ పోలీసులు తెప్పోత్సవం బందోబస్తు నిర్వహిస్తారన్నారు. సీసీ కెమెరాలతోపాటు బారికేడర్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

జాకీలు విరిగిపోతున్నాయి...

- టీడీపీ జనసేనపై మంత్రి ఆర్‌కే రోజా కామెంట్లు
- మోసం చేసైనా అధికారంలోకి రావాలన్న తాపత్రయం బాబుది
- మోదీ, అమిత్ షా కాళ్లు పట్టుకునేందుకు బాబు ఢిల్లీ వెళ్లారు



విమానాశ్రయంలో మంత్రి రోజాకు స్వాగతం పలుకుతున్న నాయకులు, అధికారులు

గోపాలపట్నం(విశాఖ పశ్చిమ): ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికలు చంద్రబాబు నాయుడ్ని, లోకేష్‌ని జాకీలు పట్టుకుని లేపాలని చూస్తున్నా.. అవి విరిగిపోతున్నాయని కానీ ఉపయోగంలేకుండా పోతుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. విశాఖలో శుక్రవారం నుంచి జరగనున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమె విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన కలిసి వచ్చినా.. విడివిడిగా వచ్చినా తమకు ఇబ్బంది లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు అందించారన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఫలానా మంచి చేశానని చెప్పుకోవడానికి ఏమీ లేదన్నారు. అందుకే వారు ఏసీ రూమ్‌ల్లో ప్రెస్‌మీట్లకే పరిమితమయ్యారన్నారు. చంద్రబాబు ఊసరవెల్లిలాగా ఎలా రంగులు మారుస్తునాడో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. అధికార కాంక్షతో ఒక సారి కాంగ్రెస్‌తో, మరో సారి బీజేపీతో సిగ్గు లేకుండా పొత్తుపెట్టుకొని ఎంత దిగజారిపోతున్నాడో అందరూ గమనిస్తున్నారు. తిరుపతికి వచ్చినప్పుడు అమిత్‌షా కారుపైన రాళ్లు, చెప్పులు ఏవిధంగా వేయించాడో అందరూ గుర్తు పెట్టుకున్నారు. ఇప్పటికైనా నేను తప్పు చేశాను ఇకనైనా నాకు అవకాశమివ్వండి ఇది చేస్తా, అది చేస్తానని ఒక భరోసా కల్పించే ఆలోచన ఆయనకు లేదన్నారు. ఎంతసేపు జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టడం, ఆయన మీద విషం చిమ్మటం లేదా సోనియా గాంధీ, అమిత్‌షా, మోదీ కాళ్లు పట్టుకోవడం చేస్తున్నాడని విమర్శించారు. ఇలాంటి మనిషి తమ చిత్తూరు జిల్లాలో పుట్టినందుకు ప్రజలంతా సిగ్గు పడుతున్నారన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

బుచ్చెయ్యపేట: క్రిమిసంహారక మందు సేవించిన యువకుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. ఈ నెల 7న మండలంలో ఆర్.శింగవరం గ్రామానికి చెందిన రేణం సాయికుమార్(22) మద్యం సేవిస్తుండగా తల్లి మందలించింది. దీంతో మనస్తాపం చెంది క్రిమిసంహారక మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు అదేరోజు కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేవుపోలవరంలో మృతదేహం లభ్యం



సత్యనారాయణ మృతదేహం

ఎస్.రాయవరం: మండలంలోని రేవుపోలవరం తీరంలో మృతదేహం లభ్యమైందని ఎస్ఐ విభీషణరావు గురువారం తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం.. అనకాపల్లి శివారు కొత్తూరు గ్రామానికి చెందిన గైపూరి సత్యనారాయణ (40) రెండు రోజుల క్రితం తన ద్విచక్ర వాహనంపై రేవుపోలవరం తీరానికి వచ్చి సముద్రంలోకి దిగాడు. ఆ తర్వాత నుంచి కనిపించకుండా పోయిన అతడి మృతదేహం తీరానికి కొట్టుకొచ్చింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు పరిశీలించి దాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్కడ అతడి దుస్తులుగానీ, చెప్పులుగానీ లభించలేదు. శరీరంపై గాయాలు లేవు. ఆత్మహత్య లేక ఈతకు దిగి గుండెపోటుకు గురై మృతి చెందాడా? అన్నది పోస్టుమార్టం నివేదిక తర్వాత వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. నక్కపల్లి సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆయా స్టేషన్ల మధ్య స్పెషల్ రైళ్లు (వయా దువ్వాడ మీదుగా) నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు.

- ఎర్నాకుళం–బ్రహ్మపూర్(06087) అన్ రిజర్వ్‌డు స్పెషల్ మార్చి 2, 9, 16, 23, 30వ తేదీల్లో (శనివారాలలో) ఎర్నాకుళంలో రాత్రి 11 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 11.07 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 5 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్–ఎర్నాకుళం(06088) అన్ రిజర్వ్‌డు స్పెషల్ మార్చి 4, 11, 18, 25వ తేదీల్లో బ్రహ్మపూర్‌లో మధ్యాహ్నం 12.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 6.05గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 6.07గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 9.40గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది.
- తాంబరం–సంత్రగచ్చి (06079) స్పెషల్ రైలు తాంబరంలో ఈ నెల 14, 21వ తేదీల్లో (బుధవారాలలో) మధ్యాహ్నం 1 గంటకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 2.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 2.35 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 8.45 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో సంత్రగచ్చి–తాంబరం(06080) స్పెషల్ సంత్రగచ్చిలో ప్రతీ గురువారాలలో ఈనెల 15, 22వ తేదీల్లో రాత్రి 11.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు సాయంత్రం 4.55గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 5 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 9.35గంటలకు తాంబరం చేరుకుంటుంది.

లాడ్జిలో యువకుడు ఆత్మహత్య

అల్లిపురం: లాడ్జిలో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా తుళ్లూరుకు చెందిన మల్‌హత్ బాలాజీ నాయక్ (28) ఈ నెల 5న పందిమెట్ట దరి ఒక లాడ్జిలో దిగాడు. ఉద్యోగం నిమిత్తం నగరానికి వచ్చానని లాడ్జి సిబ్బందికి తెలిపాడు. గురువారం ఉదయం 10 గంటలకు హోటల్ గది చెక్ అవుట్ చేయాల్సి ఉంది. ఎంతకీ అతను గది నుంచి బయటకు రాకపోవటంతో సిబ్బంది తలుపు కొట్టినా లోపల నుంచి సమాధానం రాలేదు. దీంతో వారు మహారాణిపేట పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మరో తాళం చెవితో తలుపులు తెరిచి చూడగా ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో మృతదేహాన్ని దించి కేజీహెచ్ మార్చురీకి తరలించారు. గదిలో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు తెలిపారు. లాడ్జి యాజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

రేపు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

అనకాపల్లి : మండలంలో కేఎస్ఆర్ పేట ప్రభుత్వ పాఠశాలలో ఈనెల 10న విశాఖ మహాత్మాగాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు పేట బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు ఆస్పత్రి వైద్యులు క్యాన్సర్ పరీక్షలు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు. 25 సంవత్సరాలు పైబడిన స్త్రీలకు రొమ్ము, గర్భాశయం, స్కీనింగ్, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు చేస్తారన్నారు.

రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలి


విజేతలైన విద్యార్థులతో పద్మావతి

అనకాపల్లి : స్థానిక జీవీఎంసీ పెద హైస్కూల్లో ప్రజా రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు రహదారి భద్రత అంశంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి కె.పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సందేశాత్మకంగా చిత్రాలు గీసిన పది మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఆమె బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే ధ్యేయం


పేదలకు భోజనం వడ్డిస్తున్న అప్పలరాజుయాదవ్

అనకాపల్లి : పేదరిక నిర్మూలనే ధ్యేయమని బీసీవై పార్టీ నేత నమ్మి అప్పలరాజు యాదవ్ అన్నారు. స్థానిక వేల్పులవీధి షిర్డీ సాయినాథ్ దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆయన ఆలయ మండలంలో నిరుపేదలకు అన్నదానం, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారమే ధ్యేయంగా బీసీవై పార్టీని బోడె రామచంద్రయ్య స్థాపించారన్నారు. నియోజకవర్గం వేదికగా అనేక సేవా కార్యక్రమాలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దేవస్థానం చైర్మన్ టి.బుచ్చిబాబు, ఆలయ అర్చకులు మత్స్యలింగం, పార్టీ నేతలు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 7,842 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,760	4,730
మొదటి రకం	3,560	4,120
రెండో రకం	3,470	3,660
మూడోరకం	3,240	3,520

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
అంబాజీపేట	
మ్యారేజిబ్యాండు	: సత్యనారాయణస్క్రీన్-1
ఈగల్	: సత్యనారాయణస్క్రీన్-2
యాత్ర-2	: షిర్డిసాయి
లాల్‌సలామ్	: పర్తిసాయి
గేమ్ ఆన్	: వెంకటేశ్వర
నా సామిరంగ	: శ్రీసత్య
హనుమాన్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు, ఎ నెగెటివ్-1 యూనిట్, ఓ నెగెటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 409 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 396 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.




వైఎస్సార్ జగనన్న కాలనీ నిర్మాణం


ఉపాధి నిధులతో నిర్మించిన జి. భీమవరం సిమెంట్ రోడ్డు

అభివృద్ధి పరవళ్లు


జి.భీమవరంలో నిర్మించిన సచివాలయ భవనం

సీఎం జగన్ ప్రభుత్వం వచ్చాక జి. భీమవరం అభివృద్ధి వైపు దూసుకుపోతోంది. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటి కుళాయి కనెక్షన్లు, సిమెంట్ రోడ్లు, డ్రైన్లు, అంగన్‌వాడీ కేంద్ర భవనం, కల్యాణ మండపం, ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి, పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసి ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచింది. గతంలో ఎప్పుడూ చవిచూడని అభివృద్ధి జగనన్న హయాంలోనే జరిగిందని చెబుతూ ప్రజలు ఆయన పాలన పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కశింకోట : మండలంలోని జి. భీమవరం అభివృద్ధి వైపు పయనిస్తోంది. గత నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ. 3 కోట్లతో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు జరిగాయి. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నర్సీపట్నం వైపు వెళ్లే మార్గంలో జి.భీమవరం సచివాలయం ఉంది. అడ్డాం పంచాయతీ, సింగవరం గ్రామం దీని పరిధిలో ఉన్నాయి. 3 వేల పైబడి జనాభా ఉంది. దీంతో 2 వేలు పైబడిన జనాభా కలిగిన గ్రామాల్లో సచివాలయం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం మేరకు ఇక్కడ కూడా సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా ప్రజలకు సేవలందిస్తున్నారు. గతంలో పంచాయతీ కార్యాలయానికి సరైన భవనమే కరవైన నేపథ్యంలో రూ.9 లక్షలు వెచ్చించి భవనం నిర్మించారు. దీనిపై రూ.25 లక్షలతో సచివాలయ భవనాన్ని నిర్మించి సేవలందిస్తున్నారు. వైఎస్సార్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి నిత్యం వైద్య సహాయం అందిస్తున్నారు. మారుమూలన ఉన్న గ్రామ ప్రజలు సేవలను విరివిగా వినియోగించుకుంటూ ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఈ సెంటర్‌కు రూ.24.8 లక్షలతో సొంత భవనాన్ని అన్ని సదుపాయాలతో నిర్మించి ప్రాథమిక వైద్య సేవలు అందిస్తున్నారు. రూ.14 లక్షలు వెచ్చించి జల్‌జీవన్ మిషన్ కింద 129 ఇళ్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్లు, శివారు సింగవరంలో రూ.10 లక్షలతో సిమెంట్ డ్రైన్లు నిర్మించారు. ఇవి సౌకర్యవంతంగా ఉన్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రూ.6.5 లక్షలతో అంగన్‌వాడీ కేంద్ర భవనం, రూ.3 లక్షలతో కల్యాణ మండపం, ప్రాథమికోన్నత పాఠశాలలో రూ.18.30 లక్షలతో నాడు–నేడులో భాగంగా అభివృద్ధి చేశారు. వైఎస్సార్ జగనన్న ఇళ్ల కాలనీలో 90 మంది పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. ఇందుకు రూ.కోటి 62 లక్షలు మంజూరు చేశారు. ఇప్పటికే దాదాపు సగం వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. 49 మంది లబ్ధిదారుల ఇళ్ల పట్టాలు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేశారు. మునుపెన్నడూ లేని విధంగా ఇంతటి అభివృద్ధి జరగడంతో ప్రజలు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


సచివాలయంలో సేవలందిస్తున్న సిబ్బంది


వెల్‌నెస్ సెంటర్‌లో సేవలందిస్తున్న ఏఎన్ఎం


వెల్‌నెస్ సెంటర్

జి.భీమవరం అభివృద్ధికి ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులు

- రూ.25 లక్షలతో సచివాలయ భవన నిర్మాణం
- రూ.24.80 లక్షలతో వెల్‌నెస్ సెంటర్ భవన నిర్మాణం
- రూ.9 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం
- రూ. 18.30 లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి
- రూ.14 లక్షలతో జల్‌జీవన్ మిషన్ ద్వారా 129 ఇంటింటి కుళాయి కనెక్షన్లు
- రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణం
- రూ. 10 లక్షలతో డ్రైనేజీల నిర్మాణం
- రూ.6.5 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం
- రూ.కోటి 62 లక్షలతో జగనన్న ఇళ్ల కాలనీలో 90 ఇళ్ల నిర్మాణం
- రూ.3 లక్షలతో కల్యాణ మండప నిర్మాణం

వెల్‌నెస్ సెంటర్ పనితీరు భేష్..



వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి చక్కటి వైద్య సేవలు అందిస్తున్నారు. నాకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు సెంటర్‌కు వెళ్లి సేవలు పొందుతున్నాను. అక్కడి వైద్యులు, సిబ్బంది ఎంతో బాగా సేవలందిస్తున్నారు. మందులు ఉచితంగా ఇస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది.

– ముత్తా చిన సూర్యనారాయణ, జి. భీమవరం

చక్కటి అభివృద్ధి జరిగింది..



గతంలో జి. భీమవరంలో పంచాయతీ కార్యాలయం మాత్రమే ఉండేది. ఇప్పుడు సచివాలయం, వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలు విస్తృతంగా అందిస్తున్నారు. గతంలో ఏ పని కావాలన్నా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడా శ్రమ లేదు. ఎంతో ఆనందంగా ఉంది.

– ద్వారపురెడ్డి వరలక్ష్మి, జి. భీమవరం

భలేగుంది మా బడి..



ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగేళ్లగా చదువుతున్నాను. నాడు–నేడులో పాఠశాలను బాగా అభివృద్ధి చేశారు. మరుగుదొడ్లు, బాత్ రూంల నిర్మాణంతో పాటు అన్ని వసతులు కల్పించి అందంగా తీర్చిదిద్దారు. దీంతో కార్పొరేట్ స్థాయి స్కూలు అనుభూతిని పొందుతూ ఎంతో ఆనందంగా చదువుతున్నాను. –అల్లం చేతన్, విద్యార్థి, జి. భీమవరం

ప్రజా సంఘాల ముసుగులో ఆరోపణలు తగదు


జెడ్పీ అయ్యప్పనాయుడుకు వినతిపత్రం అందిస్తున్న రవి

అనకాపల్లి : ప్రజా సంఘాల ముసుగులో కొందరు నేతలు తప్పుడు ఫిర్యాదులతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన కార్యదర్శి పలకా రవి ఆరోపించారు. పట్టణంలో గాంధీనగరంలో ఇంటి నిర్మాణం చేపడుతుంటే కొందరు ప్రజాసంఘాల అండతో ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కొంత మంది తనను రూ.3 లక్షలు అడిగితే తాను నిరాకరించడంతో ప్రజాసంఘాల నేతలను కూటగట్టుకొని తప్పుడు ప్రచారాలు చేయడం ప్రారంభించారన్నారు. వారి బెదిరింపులకు లొంగేది లేదని ఆయన స్పష్టం చేశారు. అంతకు ముందు జీవీఎంసీ కమిషనర్‌కు, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌కు, జిల్లా ఎస్పీకి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.

ప్రజాసంఘాలు, సీపీఐ నేతల ర్యాలీ..
సీపీఐ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల నేతలు జీవీఎంసీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకుని అక్రమ కట్టడాలపై న్యాయం చేయాలంటూ నినదించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు వై.ఎస్.భద్రం, దొరబాబు, పోతురాజు, మాజీ కౌన్సిలర్ బొడ్డేడ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

కశింకోట : సీఎం జగన్ అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా వలంటీర్లు కృషి చేయాలని నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. తాళ్లపాలెంలో గురువారం గ్రామ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పార్టీ నాయకులు ముసిలినాయుడు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టేబుల్ టెన్నిస్ బోర్డు వితరణ

కశింకోట : స్థానిక డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు టేబుల్ టెన్నిస్ బోర్డును గురువారం నరసింగబిల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్‌కుమార్ తన తండ్రి జ్ఞాపకార్థం అందజేశారు. హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు మాట్లాడుతూ ఈ బోర్డును వినియోగించుకుని విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీ వి. ప్రభాకరరావు, ఉపాధ్యాయులు ఆచంట రవి, ఎస్‌జీవీ ప్రసాద్, పీవీఆర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


డీపీఎన్ జెడ్పీ హైస్కూలుకు వితరణ చేసిన టేబుల్ టెన్నిస్ బోర్డు

యోగాతో అనారోగ్య సమస్యలు దూరం

అనకాపల్లి : యోగాతో అనారోగ్య సమస్యలు దూరం చేయవచ్చని విశాఖ జిల్లా మహిళా పతంజలి యోగ అధ్యక్షురాలు ప్రభుసాహూ అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో భారత స్వాభిమాన్ ట్రస్టు ఆధ్వర్యంలో యోగా తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో గ్యాస్ట్రిక్, షుగర్, బీపీ, ఊబకాయం, థైరాయిడ్, వెన్నుముక, కీళ్లనొప్పులు వంటి దీర్ఘకాలిక రోగాలు దరి చేరవని పేర్కొన్నారు. ట్రస్టు కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాసరావు, సభ్యులు మళ్ల నరసింగరావు, క్లబ్ సభ్యులు బీఎస్‌కే జోగినాయుడు, ఆడారి చిన్నవీరునాయుడు, కొణతాల శివాజీ, ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

అద్భుతంగా అభివృద్ధి చేస్తా


సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న భరత్, సునీత, లక్ష్మీసౌజన్య, ప్రసన్నలక్ష్మి, నీలిమ, లబ్ధిదారులు


పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త భరత్‌కుమార్

తుమ్మపాల : అనకాపల్లిని మంత్రి అమర్‌నాథ్ అందాల పల్లెగా అభివృద్ధి చేశారని, జగన్‌మోహన్‌రెడ్డికి మళ్లీ ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తే అనకాపల్లిని అమెరికాలా అభివృద్ధి చేసి చూపిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. ఎన్టీఆర్ మైదానంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా వారోత్సవాలకు ముఖ్య అతిథులుగా ఆయనతో పాటు ఏపీ ఇన్‌ల్యాండ్స్ వాటర్ వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకు ముందు లబ్ధిదారులైన మహిళలతో కలిసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి రూ.10.19 కోట్ల చెక్కు నమూనాను ప్రదర్శించారు. గత ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల చుట్టు తిరిగితేనే వచ్చే అరకొర పథకాలు సీఎం జగన్ హయాంలో నేరుగా ఇంటికే వస్తున్నాయన్నారు. అంతకు ముందు మెప్మా సహకారంతో చిరువ్యాపారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మందపాటి సునీత, పీలా లక్ష్మీసౌజన్య, జాజుల ప్రసన్నలక్ష్మి, కొణతాల నీలిమా భాస్కర్, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ విష్ణుమూర్తి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ రామ్మూర్తి, జెడ్పీ యు.అప్పలనాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పలు దేవస్థానాల చైర్మన్లు కె.ఎం.నాయుడు, సకల గోవింద, ఆళ్ల నాగేశ్వరరావు, కోరుకొండ రాఘవ, మెప్మా అధికారులు, ఆర్‌పీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

జగనన్నకు ధన్యవాదాలు..



జగనన్న సీఎం అయిన తర్వాత అందజేసిన రుణంతో చింతావారి వీధిలో హారిక టెక్స్‌టైల్స్ అనే చిన్న షాపు ఏర్పాటు చేసుకుని చీరలు, డ్రెస్‌లు విక్రయించడం మొదలు పెట్టాం. ప్రతి ఏటా అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, రైతు భరోసా, ఆసరా పథకాలు అందుతుండడంతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకున్నాం. వైఎస్సార్ ఆసరా కింద మా ఇద్దరికీ చెరో రూ.9 వేలు వస్తున్నాయి. ఆదుకున్న జగనన్నకు ధన్యవాదాలు

– పెదిరెడ్డి సత్యవతి, సూర్యావతి

చాలా సంతోషంగా ఉన్నాం



నా భర్త కార్పెంటర్ పని చేస్తున్నారు. ఆయన సంపాదన ఇంటి ఖర్చులకే సరిపోయేది కాదు. అలాంటి పరిస్థితిలో జగనన్న ప్రభుత్వం ద్వారా వ్యాపారం చేసుకునేందుకు రుణంగా రూ.1 లక్ష 30 వేలు అందించారు. దీంతో పట్టణంలో చిన్న వుడ్ వర్క్ షాపు పెట్టుకున్నాం. ఏటికొప్పాక తోలు బొమ్మలు తీసుకువచ్చి విక్రయాలు చేస్తున్నాము. వైఎస్సార్ ఆసరా ద్వారా ఏడాదికి రూ.17,800 వస్తుంది. ఇప్పుడు మేము చాలా సంతోషంగా ఉన్నాం.

– కోసూరి లక్ష్మి

రథసప్తమి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి


కార్యవర్గంతో కలిసి పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాబూరావు

అనకాపల్లి : ఈ ఏడాది రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాజుపాలెం సూర్యనారాయణస్వామి ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు తెలిపారు. ఆలయ ఆవరణలో గురువారం వేడుకల పోస్టర్‌ను కార్యవర్గసభ్యులతో కలిసి ఆవిష్కరించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో రూ.కోటి 40 లక్షలతో ఆలయానికి రహదారి అందుబాటులోకి వచ్చిందన్నారు. వైస్ చైర్మన్ కర్రి కోటేశ్వరరావు, కార్యదర్శి గొల్లవిల్లి కోటేశ్వరరావు, కోశాధికారి రామకృష్ణప్రసాద్ (బుజ్జి), కార్యవర్గ సభ్యులు గొల్లవిల్లి నర్సింగరావు, బండారు రమణ, బండారు ఆదిబాబు, గొల్లవిల్లి చి రంజీవి, గొల్లవిల్లి రామకోటేశ్వరరావు, సిదిరెడ్డి నూక రాజు, అందే బాబూరావు, గొల్లవిల్లి రాజు పాల్గొన్నారు.

వారపు సంతలో ధరలు ఇలా..

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర కిలోకి రూ.10 తగ్గింది. గత వారం కిలో రూ.40కి విక్రయించగా, ఈవారం రూ.30కి విక్రయాలు సాగాయి. ఇక ఉల్లిపాయలు, బంగాళాదుంప ఎప్పటిలాగే రూ.20, క్యాబేజీ, వంకాయ రూ.30, బీట్రూట్ రూ.40, క్యారెట్, బెండకాయ, పచ్చి బఠాణీలు రూ.60, క్యాప్సికం, బీరకాయ, బీన్స్ రూ.80, చిక్కుడుకాయ రూ.వందకు విక్రయాలు సాగాయి.

నేడు అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం

కశింకోట : మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట గ్రామంలో శుక్రవారం అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం పెద్ద ఎత్తున జరగనుంది. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మలసాల కుమార్‌రాజా తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎండ్ల బళ్ల పరుగు పోటీలు జరుగుతాయని, విజేత బళ్లకు బహుమతులు అందజేస్తామన్నారు. సాయంత్రం మహిళల కోలాటాలు, చిటికన భజనలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. విద్యుద్దీప అలంకరణతో పాటు బాణసంచా కాల్చనున్నట్లు తెలిపారు.

కేరళకు పన్ను వాటా కుదించటం సరికాదు

అనకాపల్లి : కేరళ రాష్ట్రానికి రావాల్సిన పన్నుల్లో వాటాను కుదించడం కేంద్రానికి సరి కాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఆర్.శంకరరావు అన్నారు. కేంద్రానికి వ్యతిరేకంగా స్థానిక నెహ్రూచౌక్‌లో గురువారం సీపీఎం నేతలు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ పీఎస్.అజయ్‌కుమార్, సీపీఐ జిల్లా నాయకుడు రాజాన దొరబాబు, కాంగ్రెస్ నాయకులు ఐఆర్.గంగాధర్, సీపీఎం జిల్లాకమిటీ సభ్యుడు గంటా శ్రీరాం పాల్గొన్నారు.

వయోవృద్ధులకు ప్రాధాన్యం కల్పించాలి

అనకాపల్లి : తమ సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు, రైల్వే, ఆస్పత్రులు, దేవస్థానాల్లో వృద్ధులకు మొదటిస్థానం కల్పించాలన్నారు.

కార్యాలయాల పనితీరుపై అవగాహన

మాకవరపాలెం: ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి పాఠ్యాంశం ఉంది. ఈ నేపథ్యంలో గురువారం తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలోని నాలుగు నుంచి ఏడో తరగతి విద్యార్థులతో క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఇందులో భాగంగా మాకవరపాలెంలో ఎంఈవో, ఎంపీడీవో, తహసీల్దార్, వెలుగు, విద్యుత్ శాఖ కార్యాలయాలతోపాటు పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లి వాటి పనితీరును ఎంఈవో మూర్తి, హెచ్‌ఎం కె.రాము వివరించారు. ప్రత్యక్షంగా కార్యాలయాల సందర్శనతో వారికి మరింతగా అవగాహన పెరుగుతుందనే ఉద్దేశంతో క్షేత్ర పర్యటన నిర్వహించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లోవరాజు పాల్గొన్నారు.